క్లుప్తంగా

మొక్కలతోనే పచ్చదనం


మొక్కలు నాటుతున్న కూలీలు

ఏర్పేడు: మేర్లపాక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా బుధవారం మొక్కలు నాటారు. పుష్పిత్ కంపెనీ సీఈఓ బలరాంరెడ్డికి సర్పంచ్ గంగాధరం మొక్కలు నాటాలని సూచించారు. దీంతో రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచుతున్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందిస్తున్న సర్పంచ్, కంపెనీ యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయమూర్తికి సన్మానం


వినోద్‌ను సన్మానిస్తున్న మల్లికార్జుననాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని గాండ్లవీధికి చెందిన పాలమంగళం వినోద్ ఇటీవల న్యాయమూర్తిగా నియమితులైన విషయం తెలిసిందే. బుధవారం ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు వారి స్వగృహానికి వెళ్లి సన్మానించారు. 26 ఏళ్లకే న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకోవడం సంతోషకరమన్నారు. పాలమంగళం రవి, నీల తదితరులు పాల్గొన్నారు.

ఆరాధన ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ తీర్థంలో అవధూత శ్రీశివశంకర వేణుగోపాలస్వామి 46వ ఆరాధన మహోత్సవాలను ఈ నెల 19న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఉదయం 9గంటల నుంచి పూజా కార్యక్రమాలు, 12 గంటలకు కార్తీక వనభోజనాలు, సాయంత్రం 5 గంటలకు భజన కార్యక్రమం ఉంటుందన్నారు. గరికపాటి రమేష్‌బాబు, వాసుయాదవ్, ఢిల్లీబాబు, గిరిబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా జియో ట్యాగింగ్


మేర్లపాకలో జియో ట్యాగింగ్ పనులు

ఏర్పేడు: మండలంలోని గ్రామాల్లో ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో బుధవారం జియో ట్యాగింగ్ ముమ్మరంగా సాగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేపట్టారు. విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని ఒక ఫ్లీడర్ కింద ఉన్న వ్యవసాయ, ఇళ్ల సర్వీస్‌లను జియో టాగ్ చేయనున్నారు. తద్వారా భవిష్యత్తులో ప్రమాదాల నివారణ, మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తించి పునరుద్ధరణ చేసేందుకు అవకాశం ఉంటుందని ఏఈ వాసుదేవయ్య తెలిపారు.

జగనన్నకే జన ఆశీర్వాదం


సంక్షేమ పట్టికను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని.. ఆయనకే ప్రజల ఆశీర్వాదం ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. మేలచూరు గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మావిళ్లపల్లి వెంకటేష్, పసల కృష్ణయ్య, సర్పంచ్ సునీత, వయ్యాల మనోహర్‌రెడ్డి, కోటయ్య, నాగభూషణ్, మనోహర్, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

ఎస్వీయూ స్థలాన్ని ఇవ్వొద్దు

తిరుపతి సిటీ: ఎస్వీయూకు చెందిన స్థలాన్ని కంచి మఠానికి ఇవ్వడాన్ని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వ్యతిరేకించారు. వారు బుధవారం వర్సిటీ పరిపాలనా భవనం వద్ద మోకాళ్లపై నిలిచి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎస్వీయూ పాలక మండలి నిర్ణయం లేకుండానే అధికారులు ఏకపక్షంగా సర్వే నంబర్ 588లో ఉన్న 13.53 ఎకరాల భూమిని కంచి మఠానికి ఇవ్వడం దారుణమన్నారు. వెంటనే అనుమతులను రద్దు చేయాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ యూనివర్సిటీ కార్యదర్శి సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్, జిల్లా అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- భావితరాల బంగారు భవితకు సీఎం జగనన్న పునాది వేస్తున్నారు
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి అనూహ్య స్పందన
- వాడవాడలా సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండా ఆవిష్కరణ


నాగలాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బుచ్చినాయుడుకండ్రిగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనను మరోసారి ఆశీర్వదించాలని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి మునస్వామి కోరారు. తలారివెట్టు గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో కలసి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును, అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ భావితరాల బంగారు భవితకు పునాది వేసే దిశగా అడుగులు వేస్తున్నారని, ఆయనను మనమంతా మరోమారు దీవించాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనరు భాస్కర్‌రెడ్డి, సురుటుపల్లి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు అజయ్‌కుమార్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే సుస్థిర పాలన సాధ్యమని మండల సచివాలయ కన్వీనర్ బి.సోమశేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం ×వై ఏపీ నీడ్స్ జగన్‌* కార్యక్రమాన్ని చెవిరి సచివాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అంతకుముందు సర్పంచులు బి.రత్నమ్మ, (చెరివి), సి.పార్వతి((మల్లవారిపాళెం ఈస్ట్) కలిసి జెండా ఆవిష్కరించారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఈఓపీఆర్డీ ముని రవికుమార్, నాయకులు సన్యాసయ్య, పరంధామ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని సచివాలయం–1లో బుధవారం ఎంపీడీఓ పీకేఎం బాబు అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలాపురం సచివాలయం–1 పరిధిలో మొత్తం రూ.24 కోట్ల మేర సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధ, వైస్ సర్పంచ్ సునీత, ఈఓపీఆర్డీ వెంకటేశులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పిచ్చాటూరులో ..

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరు సచివాలయ పరిధిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ డిస్‌ప్లే బోర్డును అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించగా, అనంతరం నాయకులు పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ముడియూరు సచివాలయ పరిధిలో ఈ నాలుగున్నరేళ్లలో రూ.33 కోట్లు మేర సంక్షేమం, అభివృద్ధి పనులకు వెచ్చించినట్లు తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు రాత్రి గ్రామస్తులతో కలిసి భోజనం చేసి రాత్రి బసలో భాగంగా డి2డి అవుట్‌రిచ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల, పీఎంసీ చైర్మన్ శంకర్ రెడ్డి, వైస్ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును స్థానిక సర్పంచులు శ్యామలమ్మ (చిన్న పాండూరు), ఈశ్వరమ్మ (రాచర్ల), ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ చిన్నపాండూరు సచివాలయ పరిధిలో రూ. 26.56 కోట్ల మేర ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి జరిగిందని తెలిపారు. స్థానిక ఉపసర్పంచ్ మహేంద్ర, నాయకులు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ: తలారివెట్టులో కరపత్రాలను అందజేస్తున్న నాయకులు


సత్యవేడు: చెరివి గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణలో నాయకులు


చిన్న పాండూరు సచివాలయంలో ..


పిచ్చాటూరు : ముడియూరులో..

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం విష్ణువర్ధనం

రేణిగుంట: అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–19 బాలికల విభాగంలో రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయిని విష్ణువర్ధనం తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు విజయవాడలో 67వ స్కూల్ గేమ్స్ జరిగినట్లు చెప్పారు. తమ పాఠశాలకు చెందిన సంజన, భారతి పాల్గొన్నట్లు చెప్పారు. సంజన బంగారు పతకాన్ని సాధించి డిసెంబరులో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. పీఈటీ రేఖారాణి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

మావిళ్లపాడులో సీసీ రోడ్డు ఏర్పాటు


మావిళ్లపాడులో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలోని మావిళ్లపాడు గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా నిర్మాణం చేశారు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి కోటా నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. 400 మీటర్ల మేర సిమెంటు రోడ్డు వేశారు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మూడేళ్ల కిందట ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై పలు కారణాలతో రద్దయ్యాయి. తిరుపతి పార్లమెంటు స్థానానికి ఉప ఎన్నిక జరిగిన సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన గురుమూర్తి, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి స్థానికులు రోడ్డు నిర్మాణం చేయాలని విన్నవించారు. ఆ హామీ మేరకు ఇటీవల మావిళ్లపాడు రోడ్డు నిర్మాణానికి ఎంపీ తన కోటా నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో స్థానిక ఎంపీటీసీ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు నిర్మించారు. ఏళ్ల తరబడి మట్టి రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు పడిన గ్రామస్తుల కష్టాలు తీర్చేందుకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయడంపై ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్ హెచ్చరించారు. ఆయన గాజులపెళ్లూరు గ్రామంలో బుధవారం వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ముఖ్యంగా కలుషితమైన నీటి ద్వారా, దోమల ద్వారా వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రజకసంఘం నాయకులు

శ్రీకాళహస్తి: గుంటూరులో ఈనెల 26న జరిగే రజకుల ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక కులవృత్తుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు సంజాకుల మురళి, రాచేటి సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం పట్టణంలోని పెండ్లిమండపం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో రజక వృత్తిపై ఆధారపడి ఉన్న వారు 17 రాష్ట్రాల్లో ఎస్సీలుగా ఉన్నారన్నారు. దక్షిణ భారత దేశంలో మాత్రం బీసీలుగా ఉంటున్నారని తెలిపారు. రజకులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రజక సమస్యలపై జరిగే ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జయశ్యామ్, మురళి, వీరాస్వామి, మునికుమార్, బాబు, లోకేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయానికి వెండి వస్తువుల వితరణ


వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయానికి వెంకటగిరికి చెందిన శ్రీబాలాజీ షాపింగ్ మాల్ అధినేత బాలాజీ, బాలకృష్ణ, వెంకటేష్ రూ.52 వేలు విలువ చేసే వెండి వస్తువులను వితరణగా అందజేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన


కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గుణశేఖర్

సత్యవేడు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, చికిత్స విధానాలను వివరించారు. కుష్టువ్యాధిని ప్రథమ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో కూడా కుష్టు వ్యాధి గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఎంపీహెచ్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

తిరుపతి సిటీ: యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చని స్విమ్స్ సీనియర్ ప్రొఫెసర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ వనజాక్షమ్మ తెలిపారు. టీటీడీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం రోటరీ తిరుపతి గ్రేటర్ సిటీ, పీస్ పార్క్, స్వర్ణముఖి ఆధ్వర్యంలో మహిళల జీవనశైలి విధానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆధునిక ప్రపంచంలో ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా చేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. రోటరీ గ్రేటర్ సిటీ అధ్యక్షుడు, స్విమ్స్ డాక్టర్ మునస్వామి మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడమే ఆరోగ్యమన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భద్రమణి, వనజ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. రోటరీ జోనల్ గవర్నర్ విశ్వప్రకాష్ మాట్లాడుతూ రోటరీ ప్రాముఖ్యతను, సేవాభావాన్ని, బిల్ గేట్స్ ద్వారా పోలియో నిర్మూలనలో రోటరీ పాత్రను వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతి, బి.మహేశ్వరి, మహదేవమ్మ, లక్ష్మి, అరుణకుమారి, శిరీష, విద్యుల్లత పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

రేణిగుంట: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ అధికారిణి శ్రీముఖి అన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన జరిగింది. పుస్తక పఠనంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో రేణిగుంట ఈఓ హరిబాబు, ప్రధానోపాధ్యాయుడు మునిరత్నం, మాణిక్యం, రవి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

శ్రీకాళహస్తి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ పుస్తక ప్రదర్శనలో ఆధ్యాత్మిక, కథలు, జీవిత చరిత్రలు, నవలలు, పోటీ పరీక్షలు తదితర పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థులు వీటిని ఆసక్తిగా తిలకించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవ ర్యాలీ

నాగలాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా బుధవారం మండలంలోని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధుబాల పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సునీత, నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, పీడీ సురేంద్ర, హరిబాబు, గ్రంథాలయ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


ర్యాలీలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయాల అధికారి మధుబాల


పుస్తక ప్రదర్శనను వీక్షిస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

నారాయణవనం: జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, నీతి కథల పుస్తకాలు, దినపత్రికలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎంఈఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలను బాల్యం నుంచే పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ జీవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణవనం: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు విద్యార్థులు క్రీడల పట్ల శ్రద్ధ చూపాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సులోచన తెలిపారు. బుధవారం పాఠశాలలో క్రీడలను నిర్వహించి, ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, సదాశివం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


చిలమత్తూరులో ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌరిశంకరరావు

వరదయ్యపాళెం: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌరిశంకరరావు హెచ్చరించారు. మండలంలోని చిలమత్తూరు గ్రామంలో ఆక్రమణకు గురైన శ్మశానానికి వెళ్లే దారి సమస్యపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామస్తులతో కలసి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంబంధిత భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానిక వీఆర్వోను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ వేణుగోపాల్, సర్పంచ్ కిషోర్, గ్రామస్తులు ఉన్నారు.

59 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


పిచ్చాటూరులో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భావన


కంటి ఆపరేషన్ అవసరమైన వారిని తిరుపతికి తరలిస్తున్న వైద్యులు

పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 59 మందికి కంటి వైద్యపరీక్షలు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ హమీద్ తెలిపారు. ఈ శిబిరంలో తిరుపతికి చెందిన అరవింద కంటి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భావన ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో ముగ్గురికి ఉచితంగా ఆపరేషన్ చేయడానికి తిరుపతికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బాలాలయం పూజలు


పూజలు చేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన ఏడుగంగమ్మల తెట్టు శిలావిగ్రహం బాలాలయ పూజలను బుధవారం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. రోడ్డు ఎత్తు పెరగడంతో శిలా విగ్రహం లోపలకు వెళ్లిందన్నారు. దీంతో బాలాలయ పూజలు నిర్వహించి పునఃనిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజూరు బాలసుబ్రమణ్యం, స్వర్ణమూర్తి, షణ్ముగం, శేఖర్, గణేష్, జగదీష్, కార్తికేయన్, సత్య, కొల్లూరు హరి, పత్తి మణి, ఆనంద్, రాజేంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వార్డు భవనానికి రూ.1.79 కోట్ల మంజూరు


మాట్లాడుతున్న డాక్టర్ రవిప్రభు

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రిలోని టీబీ వార్డు నూతన భవన నిర్మాణానికి రూ.1.79 కోట్లను టీటీడీ పాలకమండలి కేటాయించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. ఆయన బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రుయాలోని టీబతీ వార్డు భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ సమస్యను రుయా అభివృద్ధి వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్‌తో కలిసి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. టీటీడీ బోర్డు సమావేశంలో రూ.1.79 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రాయలసీమ పెద్ద ఆసుపత్రిగా సేవలందిస్తున్న రుయా అభివృద్ధికి సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నాడు – నేడు కింద సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. రూ.23.75 కోట్లతో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ భవనాన్ని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే అక్యూట్ కేర్ నూతన బ్లాక్‌ను రూ.26.91 కోట్లతో చేపట్టినట్టు తెలిపారు.

కృష్ణా జలాల పునః పంపిణీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

తిరుపతి కల్చరల్: కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు పీడిత మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 20, 21న విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. ఆయన బుధవారం సీపీఐ కార్యాలయంలో దీక్ష పోస్టరును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణానది నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టుల వారీగా 811 టీఎంసీల నీటిని కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 199 టీఎంసీలు వాడుకుంటున్నాయని తెలిపారు. మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును బ్రిజేష్ కుమార్ కాలరాయడంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా బ్రిజేష్ కుమార్ తీర్పు అమల్లోకి రాకుండానే కేంద్రంలోని బీజేపీ ఓట్ల కోసం రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను జఠిలం చేసి లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. దీన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు విశ్వనాథ్, కె.రాధాకృష్ణ, ఎన్.శివ, ఎన్‌డీ.రవి, కేవై.రాజా, రామకృష్ణ, గోవిందస్వామి, బాల, పూర్ణ, శ్రీనివాస్, ప్రమీల, అల్లాబాషా, వెంకటేష్ పాల్గొన్నారు.